గురువు ప్రత్యక్ష దైవం

జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పర్వాటు చేసిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను జ్ఞానవంతులుగా మార్చేది గురువులు మాత్రమేనని, గురువే కనిపించే ప్రత్యక్ష దైవమని అన్నారు. అనంతరం పర్వాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శాలువాలు, పూలమాలతో సత్కరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతులకు పాఠాలు బోధించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 5

పటాన్‌చెరు: గీతంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ డీఎస్ రావు

రామచంద్రాపురం: వెలిమెల టీఎస్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

సమన్వయంతో పనిచేయాలి

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, సెప్టెంబర్5: వినాయకచవితి వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అధికారులను కోరారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గణేశ్ వేడుకల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. వినాయకుడి విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, విద్యుత్, అగ్నిమాపక, రెవెన్యూ శాఖ, తాగునీరు, ఆర్‌అండ్‌బీ, వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. వినాయకుల శోభాయాత్ర సందర్భంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలన్నారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ పండుగ శాంతియుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరో కార్యక్రమంలో జహీరాబాద్ మండలంలోని మల్చెల్మ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సమావేశంలో ఆర్డీవో రాజు, డీఎస్పీ రామ్మోన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, తంజీమ్ పాల్గొన్నారు.

చురుగ్గా రైతు కుటుంబాల నిర్ధారణ

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

న్యాల్‌కల్, సెప్టెంబర్ 5: రెండు లక్షల్లోపు పంట రుణమాఫీ కానీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం చురుగ్గా సాగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని హద్నూర్, చాల్కి, న్యాల్‌కల్ గ్రామాల్లోని రైతు వేదికల్లో వ్యవసాయాధికారులు నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ కానీ రైతులు 18,872 మంది ఉన్నారన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి 10,220 మంది రైతుల నుంచి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. న్యాల్‌కల్ మండలంలో 1,751 కుటుంబాలకు సంబంధించి 1,250 కుటుంబ సభ్యుల నిర్ధారణ పూర్తయిందన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో 3,224 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్ తదితర మండలాల్లో 2,224 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఆనంతరం పలు గ్రామాల్లో పత్తి, సోయాబీన్, చెరుకు తదితర పంటలను పరిశీలించారు. చేన్లలో వరద నీరు నిల్వకుండా బయటకు పంపించాలని రైతులకు సూచించారు. ఆయనవెంట జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయాధికారి అభినాష్ వర్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిలు, సాయికిరణ్‌రెడ్డి ఉన్నారు.

సర్దార్ జ్యోతికి డాక్టరేట్

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 5: తారా ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ అధ్యాపకురాలిగా పనిచేసి ఇటీవల బదిలీ అయిన సర్దార్ జ్యోతికి డాక్టరేట్ వచ్చింది. హిందీ భాషలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూ 'సమకాలీన్ ఉపన్యాసోం మే యథార్థ్వాద్ ఏవం వైచారిక్త' అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు ఆమెకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ సంగారెడ్డికి చెందిన తాను తారా ప్రభుత్వ కళాశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్నానని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్నారు.

రేజింతల్ సిద్ధివినాయక ఆలయం, సిద్ధి వినాయకుని విగ్రహం

ముస్తాబైన సిద్ధి వినాయక ఆలయం

న్యాల్‌కల్, సెప్టెంబర్ 5: వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయం ముస్తాబైంది. ఈనెల 7వ తేదీ నుంచి 17 వరకు జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నవరాత్రుల పాటు అఖండ దీపోత్సవం, గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేయనున్నారు. స్వామివారి దర్శనానికి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. భక్తుల దర్శనాల కోసం ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, వాహనాల పార్కింగ్‌తో పాటు తాగునీరు, అన్నదానం తదితర సౌకర్యాలు కల్పించేందుకు సర్వం సిద్ధం చేశారు.

కలెక్టర్‌కు మట్టి విగ్రహం అందజేత

సంగారెడ్డి, సెప్టెంబర్ 5: రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు అని, పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షుడు రాహుల్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మట్టి విగ్రహాన్ని అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు ఉమేశ్, రఘు ఉన్నారు.

కలెక్టర్ క్రాంతికి మట్టి గణపతిని అందజేసిన హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు

జేఏసీపై చౌకబారు ప్రకటనలు సరికాదు

మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధక్షుడు జావేద్ అలీ

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 5: తెలంగాణ ఉద్యోగుల జేఏసీపై చౌకబారు ప్రకటనలు మానుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎండీ జావేద్ అలీ పేర్కొన్నారు. గురువారం టీఎన్‌జీవో భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించే రీతిలో రూ.130 కోట్ల విరాళాన్ని ప్రకటించిన నేపథ్యంలో అనేక సంఘాలు హర్షిస్తున్న తరుణంలో లచ్చిరెడ్డి జేఏసీ నాయకుడిగా, బాధ్యుడిగా పేర్కొంటూ రూ.100 కోట్ల విరాళం ఇప్పించినట్లు ప్రకటనలు చేయడం జేఏసీ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఉద్యమం అంటే పత్రిక ప్రకటనలు కాదని, క్షేత్ర స్థాయిలో పోరాటం చేయడమని గుర్తుంచుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లను తప్పుదోవ పట్టిస్తున్న లచ్చిరెడ్డి వైఖరి సరికాదన్నారు. ప్రభుత్వ గుర్తింపు సంఘాలన్నీ మారం జగదీశ్వర్, ఏలురు శ్రీనివాసరావు అధ్యక్షతన ఉన్న జేఏసీలోనే భాగస్వామ్యమని తెలిపారు. గుర్తింపు లేని కొన్ని సంఘాల్లో కొందరిని పోగేసుకొని గందరగోళం సృష్టిస్తున్న లచ్చిరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ కోచైర్మన్ వైద్యనాథ్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, టీఎన్‌జీవో నాయకులు శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, సంతోష్, గౌస్, విజయ్‌కుమార్, రవి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

మునిపల్లి పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మునిపల్లి, సెప్టెంబర్ 5: ప్రభుత్వ దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందుతుందని ప్రజలకు నమ్మకం కలిగించేలా పని చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మునిపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. దవాఖాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ నుంచి స్టాక్ రిజిస్టర్ ఎందుకు నిర్వహిస్తలేరని ప్రశ్నించారు. రిజిస్టర్‌లో మందులు లేవని చూపించి, పరిశీలిస్తే దవాఖానలో విచ్చలవిడిగా మందులు ఉండడంతో సంబంధిత అధికారిపై మండిపడ్డారు. దవాఖాన పైభాగం నుంచి వర్షపు నీళ్లు ఉరుస్తుండడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మునిపల్లి వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో హరినందన్‌రావు, ఎమ్మెవో దశరథ్, వైద్యుడు రవి, ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

శిథిల భవనం కూల్చివేత

కమిషనర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

లక్ష్మీ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బొల్లారం, సెప్టెంబర్ 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ నగర్‌లో శిథిలావస్థకు చేరిన భవనాలపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 2న 'ఆదమరిస్తే అంతే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీలో నిరుపయోగంగా ఉన్న భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు స్పందించి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ మున్నీ నవీన్ ఆధ్వర్యంలో శిథిల భవనాన్ని జేసీబీ సహాయంతో కూల్చివేశారు. అధికారుల స్పందనతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కాలనీలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది రవి, దినేశ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రయ్య

కొండాపూర్, సెప్టెంబర్ 5: దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చందయ్య తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన సందిని ఆంజేయులు తాపీమేస్త్రీగా పని చేస్తూ ఇండ్లలో చోరీలు, బైక్‌లు దొంగిలించేవాడు. ఆంజనేయులుపై నల్గొండ, సూర్యపేట, వరంగల్, ఖమ్మం, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దాదాపు 30 దొంగతనాల కేసులు నమోదయ్యాయి. పది కేసుల్లో 30.9 తులాల బంగారం, 188 తులాల వెండి, రూ.9.50లక్షల నగదు దొంగిలించాడు. ఆరు కేసుల్లో 15.8 తులాల బంగారం రికవరీ చేశారు. అర్ధరాత్రి సమయంలో తాళం వేసిన ఇండ్లలో చోరీకి పాల్పడుతుంటాడు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను సైతం తీసుకుపోతాడు. దొంగిలించిన వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులను తాగుడు, విలాసాలకు ఖర్చు చేస్తాడు. మల్కాపూర్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సీఐ, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, రాకేశ్‌నాయక్, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్ దొంగను పట్టుకున్నారు. కేసును ఛేదించిన 18 మంది సిబ్బందికి రికార్డు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

హత్నూర, సెప్టెంబర్ 5: కారు, ఆటోను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన హత్నూర మండలం వడ్డెపల్లి శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సాలాజిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సాయిలు రేగోడ్ మండలం ఇటికేపల్లి గ్రామానికి చెందిన పుట్టి లక్ష్మి, పులబోయిన విత్తమ్మ, భవాని, వర్షితను పటాన్‌చెరు మండలం కిష్టారెడ్డిపేటకు ఆటోలో తీసుకువస్తున్నాడు. వడ్డెపల్లి శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న సాయిలు, పుట్టి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సంగారెడ్డి దవాఖానకు తరలించారు.

ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

హత్నూర, సెప్టెంబర్ 5: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఘటన హత్నూర మండలం వడ్డెపల్లి శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రయాణికులు, హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ నుంచి వడ్డెపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు వడ్డెపల్లి శివారులో ప్రధాన రహదారిపై మట్టి ముద్దలు పడటంతో అదుపుతప్పి కిందపడ్డాడు. అదేసమయంలో దౌల్తాబాద్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతడిని తప్పించబోయేక్రమంలో ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో అదుపుతప్పి రోడ్డుకిందకు దూసుకెళ్లింది. బస్సులో 35మంది ప్రయాణికులు ఉన్నారని, తృటిలో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఓటరు నమోదు ప్రక్రియపై అధికారుల సమీక్ష

బొల్లారం, సెప్టెంబర్ 5: బొల్లారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో గురువారం బీఎల్ఓలతో అధికారులు సమావేశమయ్యారు. ఇటీవల కలెక్టర్ వల్లూరు క్రాంతి మున్సిపాలిటీలో పర్యటించి ఓటరు ప్రక్రియపై ఆరా తీసిన నేపథ్యంలో మున్సిపల్ మేనేజర్ నిర్మల, ఆర్వో నర్సింహులు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణ మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటరుగా నమోదు చేయించుకోవడానికి అవకాశం ఉందన్నారు. సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు.

డ్రైనేజీ నిర్మాణం

ఝరాసంగం, సెప్టెంబర్ 5: ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామంలోని బీసీ కాలనీ వాసులు డ్రైనేజీ నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించకపోవడంతో విసుగుచెందారు. విషయాన్ని అదే కాలనీకి చెందిన పాత బాయి భీమన్న దృష్టికి తీసుకురావడంతో గురువారం గ్రామంలోని 6వ వార్డులో సుమారు 20 మీటర్ల మేర సొంత ఖర్చులతో మురికి కాల్వ నిర్మించి సమస్యను పరిష్కరించారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు.

సీఐటీయూతోనే సమస్యలు పరిష్కారం

గుమ్మడిదల,సెప్టెంబర్ 5: సీఐటీయూతోనే హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతిరెడ్డి, ఈశ్వర్, కొండల్, కృష్ణ, వీరేశ్, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 5: జిల్లా ప్రభుత్వ వసతిగృహాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కళాశాలలు, వసతి గృహాలు కొనసాగుతున్నాయని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. గురువారం పట్టణంలోని బీసీ కళాశాల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెంచి, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించి మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, మహేష్, శ్రీకాంత్, రాజేష్, శేఖర్‌తో పాటు ఆయా వసతిగృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

విష జ్వరాలను అరికట్టాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 5: భారీ వర్షాలకు జిల్లాలో విష జ్వరాలు విజృంభించే అవకాశాలు ఉన్నాయని, అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం డీసీహెచ్‌వో, డీఎంహెచ్‌ఓలకు సీపీఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రోగుల నుంచి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ దవాఖానాలు, డయాగ్నోస్టిక్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మాణిక్, రాజయ్య, యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.

అదనపు కోర్టులు మంజూరు చేయాలి

హైకోర్టులో న్యాయమూర్తి రాధారాణికి వినతిపత్రం ఇస్తున్న బార్ సభ్యులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 5: జిల్లా కోర్టు ప్రాంగణంలో అదనపు కోర్టుల మంజూరుతో పాటు ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీ చేయాలని పోర్ట్ పోలియో న్యాయమూర్తి డాక్టర్ రాధారాణిని హైకోర్టులో కలిసి విన్నవించారు. గురువారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైకోర్టుకు తరలివెళ్లి పోర్ట్‌ఫోలియో న్యాయమూర్తిని కలిసి జిల్లా కోర్టులో న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కోర్టులో పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని, అదనపు కోర్టుల మంజూరు, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్యాయమూర్తి తెలిపారు. ఇందులో బార్ సభ్యులు సూర్‌రెడ్డి, అంబరీశ్, రమేశ్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీర మహేందర్, నిజామొద్దీన్, జ్ఞానోబా, పెంటయ్య, రమాదేవి, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రమాదకరంగా గుర్మిలావాగు వంతెన

గుర్మిలావాగు వంతెన, వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

రాయికోడ్, సెప్టెంబర్ 5: కురుస్తున్న భారీ వర్షలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. గురువారం మండల పరిధిలోని కుస్నూర్ శివారులోని గుర్మిలావాగుపై ఉన్న వంతెన వరద ఉధృతికి ప్రమాదకర స్థితిలో ఉండడంతో తహసీల్దార్ పరిశీలించి ఊరికి రెండు వైపులా కంచె ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుధవారం వంతెన కొంతభాగం కూలిపోయిందని, భారీ వరద కారణంగా వంతెన కూలిపోయే దశకు చేరుకుందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణాలు చేయవద్దని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రమాద తీవ్రత గురించి కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఆయనవెంట ఆర్ఐ ప్రభాకర్, పంచాయతీ కార్యాదర్శి సరిత ఉన్నారు.

ఇండ్లలోకి మురుగు నీరు

కంది, సెప్టెంబర్ 5: భారీ వర్షాలకు మురుగు కాల్వ నీరంతా ఇండ్లలోకి వస్తున్నదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని పాత కందివాసులు గురువారం పంచాయతీ అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పాత కందిలోని నాళాలో ప్రవాహం ఎక్కువై మురుగు నీరంతా రోడ్డుపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురువక ముందు నాళాను శుభ్రం చేయించాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత నీటి ప్రవాహంతో ఉన్న ఇండ్లు కూలిపోయే పరిస్థితి ఉన్నదని వాపోయారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీఓ మహేందర్‌రెడ్డి పరిశీలించి జేసీబీ సాయంతో నీటి ప్రవాహాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టారు. అనంతరం పాత కందిలో కూలిపోయిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.

కబ్జా నుంచి రాయికుంట చెరువును కాపాడండి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 5: మాజీ సర్పంచ్ మహిపాల్‌గౌడ్ రాయికుంట చెరువును కబ్జా చేశారని బాధిత రైతులు ఖానాపూర్ ఎల్లారెడ్డి, ఖానాపూర్ శేఖర్‌రెడ్డి, ఖానాపూర్ కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రామచంద్రపురం మండలం వెలిమెల గ్రామంలోని సర్వే నంబర్ 421లోని రాయికుంట చెరువును దాదాపు 20.30 ఎకరాలను మహిపాల్‌గౌడ్ ఆక్రమించి చెరువు తూమును తొలిగించారని ఆరోపించారు. సర్వేనంబర్ 15లో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. మహిపాల్‌గౌడ్ అక్రమాలపై హైడ్రాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు చేపట్టాలని, పొలంలోకి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి

కోహీర్, సెప్టెంబర్ 5: భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్, మూసానగర్, ఫయాజ్‌నగర్ కాలనీల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గుంతలను వెంటనే పూడ్చి వేయాలని సూచించారు. అల్గోల్ రోడ్డుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టును పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 5: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులను కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆంగ్లంలో 3, తెలుగులో 4, హిస్టరీలో 1,కెమిస్ట్రీలో 2, పొలిటికల్ సైన్స్‌లో 1, బీబీఏలో 1, బీబీఏ రిటైల్‌లో 1, కంప్యూటర్ సైన్స్‌లో 8 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారు 10న ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు 94410 69020, 79892 39115 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ భాయి తెలిపారు. క